# రాధారాధన

మెడికల్ షాపులో మందులమ్ముతున్న రాధను చూచి బిత్తరపోయాడు, తత్తరపోయాడు, చలించిపోయాడు వేణు. ఆమె అటుపోతుంటే చూశాడు. ఇటువస్తుంటే చూశాడు. అటు తిరిగితే చూశాడు. ఇటు తిరిగితే చూశాడు. ఎటుచూచినా బొమ్మలాగా ఉంది. అద్భుతశిల్పి చెక్కిని పాలరాతి విగ్రహంలాగా ఉంది. బ్రహ్మదేవుడే తాను సృష్టించిన బొమ్మను చూచి నిగ్రహం కోల్పోయేట్టుగా ఉంది. ఏ అవయవం చూచినా, తీరుతెన్నులు అద్భుతంగా ఉన్నాయి. ఇంత అందమైన బొమ్మలు లోకంలో ఉంటారని పాతికేళ్ళ వేణుకు తెలియదు. పెళ్ళికాని వేణు కాబోయే భార్య కోసం కనపడ్డ ఆడపిల్లనల్లా చూస్తున్నాడు. తానింతవరకు ఇంతటి అందమైన అమ్మాయిని చూడలేదు. అందమైన ఆడపిల్లల విగ్రహాలు, చిత్రాలు, బొమ్మలు చాలా ఉంటాయి, కానీ కదిలే బొమ్మలు, నడిచే విగ్రహాలు, తిరుగాడే చిత్రాలు ఉండవు. బొమ్మవంటి అమ్మాయి కదులుతుంది, నడుస్తుంది. తిరుగుతుంది. ప్రాణమున్న బొమ్మ వంటి అమ్మాయి ముఖంలో ఎప్పుడు పరికించినా కొత్తరూపమే! కొత్త అందమే! కొత్త చలనమే! చలనం సౌందర్యానికి ఎంత చైతన్యం ప్రసాదించింది! వేణు ఆశ్చర్య పోతున్నాడు.

రాధ కాల్‌పాల్ తెచ్చింది. కౌంటర్ అద్దంమీద పెట్టింది. వేణు తీసుకొన్నాడు. నోటు అక్కడే పెట్టాడు. చిల్లర అక్కడే ఉంచింది. ఉన్న చిల్లర తీసుకొన్నాడు. మెట్లు దిగాడు. ఎదుటి కాఫీ హోటల్లో స్కూటర్ ఆపాడు. కాఫీ కాబోలు చెప్పాడు.

రాధకు ఆశ్చర్యం కలిగింది. యువకులు అందరూ మందులు డబ్బులు ఇచ్చి పుచ్చు కొనేటప్పుడు తినేసేటట్లు ముఖంలోకి చూస్తారు. అతను అలా చూడలేదు. తానటు తిరిగినప్పుడు ఇటు చూస్తున్నాడు. చాలామంది మాట్లాడవలసిన పనిలేకపోయినా, ఏదో అడుగుతారు. ఏమో చెబుతారు. పలకరించటం వాళ్ళకు పరమానందం. కొందరు చేతులు, వేళ్ళు తగిలించటానికి తీవ్ర ప్రయత్నం చేస్తారు. విజయవంతులు కూడా అవుతారు పరధ్యానంగా తానున్నప్పుడు. ఇతను అటువంటివి ఏమీ చేయలేదు. నోరు మెదపలేదు. చేయి కదపలేదు. భయంభయంగా చూశాడు. మొగమోటస్తుడు. ధైర్యం తక్కువ. అందంగా ఉన్నాడు. ఆరోగ్యంగా ఉన్నాడు. సంపన్నుడు లాగున్నాడు. వెకిలిచూపులు, చేష్టలు, మాటలు లేవు. దొంగ చూపుల్లో భయముంది. ఆరాధన ఉంది. అనురాగం ఉంది. పెళ్ళయిందో! కాలేదో! అనుకొంటూ ఉంది, పద్దెనిమిదేళ్ళ పెళ్ళికాని రాధ.

స్వాతంత్ర్యానికి పూర్వం అంతగా లేని, రాను రానూ అధికమవుతున్న సేల్స్‌గర్ల్స్ ఉద్యోగాలు అందచందాలున్న యువతుల సౌందర్యం పెట్టుబడిగా వ్యాపారం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసే వృద్ధులుండగా యువకులు ఆనందం పొందుతున్నారు. స్త్రీలూ స్త్రీవాదులైన పురుషులూ స్త్రీ శ్రమశక్తి కొంతశాతమైనా దుర్వినియోగం కావటం లేదని సంతోషిస్తున్నారు. సేల్స్‌గర్ల్స్ గా పనిచేసే యువతుల తల్లిదండ్రులు, వాళ్ళు జీతంమీద ఆధారపడ్డ వాళ్ళు, తమ జీవితాలు కొంతయినా సుఖశాంతులు పొందటానికి అమ్మాయి ఆదాయం ఆధారమని సంతోషిస్తున్నారు.

రాధ తల్లివృద్ధురాలు, అరవయ్యేళ్ళు. లేకలేక పుట్టిన ఏకైక సంతానం రాధ. తండ్రికి డెబ్బై ఏళ్ళు. టీచరుగా రిటైరు అయ్యాడు. పదిహేనేళ్ళ పూర్వం తన పెన్సన్‌తో కుటుంబం బొటాబొటిగా గడిచేది. కాలక్రమంలో రేట్లు పెరిగి, ఆ పెన్షిన్ ఎందుకూ చాలకుండా పోయింది. రాధను ఇంటరుదాకా చదివించారు. ఎంసెట్ రాసింది. మెడిసన్‌లో చేరేదే! ఆర్థికంగా పరిస్థితులు బాగా లేక ఆ దృష్టి మానుకొంది. మందుల షాపులో సేల్స్‌గర్ల్ కావాలనగానే ఎగిరి గంతేసి పనిలో చేరింది. అన్ని మందుల పేర్లు తెలుసు. ఏ జబ్బుకు ఏ మందో తెలుసు. ఆ మందుల మధ్య తాను డాక్టరు అయినంత ఆనందం పొందుతూ ఉంది. పేదలెవరైనా డాక్టర్ను కలవకుండా జబ్బు చెప్పి మందు తీసుకెళ్ళి జబ్బుతగ్గి రాధకు దండం పెడుతుంటారు. అదీ కొంత సంతోషమే! వృద్ధాప్యంలో తల్లిదండ్రులు. కొంత ఊరట పొందుతున్నారీ రాధ జీతంతో.

రాధకో ప్రత్యేక ప్రయోజనం కలిగిందీ ఉద్యోగంవల్ల! మనుషులు బాగా అర్థం కాసాగారు. మనిషి మనస్తత్వం సరిగా అంచనా వేసుకోగలుగుతూ ఉంది. ప్రత్యేకంగా పెళ్ళి చూపులంటూ లేకపోయినా చాలామంది పెద్దలు యువకులు స్త్రీలు చూచి తమ వాళ్ళకు రాధ ఈడూ జోడూ కుదురుతుందేమోనని ఆలోచిస్తున్నట్లు ఆమె గుర్తించింది.

తాను చాలామంది యువకుల్ని చూస్తూ ఉంది, ఎవరు ఎటువంటివాళ్ళో పరికిస్తుంది. ఎవరు పనికి వస్తారో, ఎవరు పనికిరారో అనేది తెల్చుకోగలుగుతూ ఉంది. తాను తనకు తగిన మనిషిని నిర్ణయించుకోగలిగే పరిస్థితి అర్థం చేసుకోసాగింది. ఈ పనిలో తాను చేరక పోతే ఇంత పెద్ద వరుల మార్కెట్టును చూడగలిగేది కాదు. ఇంత వరకు కంటికి, మనస్సుకు నచ్చిన మనిషి, ఇవాళ తప్ప, కనిపించలేదు.

ఇంకా ముగ్గురు సేల్స్ గర్ల్స్ ఉన్నా, అందరూ తనకే ప్రిస్క్రిప్షన్ కాగితం ఇవ్వటం, మందులు తీసుకోవటం, డబ్బు చెల్లించటం చూస్తుంటే తనమీద తనకే ఆత్మవిశ్వాసం ఏర్పడసాగింది. తాను ఒక ప్రత్యేక ప్రాణిగా భావించుకొంటూ ఉంది.

కాల్‌పాల్ మింగి కాఫీ తాగుతున్న వేణు మెడికల్ షాపు వైపే చూస్తున్నాడు. జ్వరమా? వళ్ళు నొప్పులా? రాధ ఆలోచింప సాగింది. ఆరోజు చాలాసేపు వేణు అక్కడే కూర్చున్నాడు. తనను దూరం నుంచి ధైర్యంగా చూస్తున్నాడితను అనుకొంది రాధ.

ప్రతిరోజు ఉదయం సాయంకాలం వచ్చేవాడు. ప్రిస్క్రిప్షన్ ఇచ్చేవాడు. కోరింది ఇచ్చేది. తీసుకొనేవాడు. డబ్బు ఇచ్చేవాడు. వెళిపోయే వాడు. ఎప్పుడూ ముఖంలోకి చూడలేదు. తాను పనిలో ఉన్నప్పుడు చూచేవాడు. తాను చూస్తున్నప్పుడు తల దించుకొనేవాడు. మాట్లాడడు. మౌనం. కన్నెత్తి చూడడు. భయం. పలకరించడు. సిగ్గు. చేయి తాకడు. వణుకు.

హోటల్లో కూర్చుంటాడు. దూరం నుంచి ధైర్యంగా చూస్తుంటాడు. తాను చూస్తున్నా, భయం లేకుండా, చూస్తాడు. గంటల తరబడి కాఫీ తాగుతూ ఉంటాడు. ఆకలయితే స్కూటర్ స్టార్ట్ చేస్తాడు. ఒకసారి వీధిలో కనిపించాడు. ఒకసారి తమ ఇంటి దగ్గరే ఎదురయ్యాడు. ఒకసారి మెడికల్ షాపు ఓనరుతో ఏదో మాట్లాడి వెళిపోయాడు. ఏం మాట్లాడాడో వినిపించలేదు. భయం! నెమ్మదిగా ఏదో చెప్పి వెళిపోయాడు. వేణును తానే మాట్లాడించాలని వారం రోజులుగా రాధ అనుకొంటూ ఉంది. కానీ ధైర్యం చాలలేదు.

ఇతను రోజుకు రెండు తీసుకుపోతున్నాడు. ఏంచేస్తున్నాడు? ఎందుకు తీసుకుపోతున్నాడు? రాధ ఆలోచనలో పడింది.

ఒకరోజు ధైర్యం చేసి, గుండె దిటవు చేసుకొని అడిగింది. 'మీకు పెళ్ళయిందా?' వణికి పోయాడు. దొంగ దొరికినట్లు గందరగోళపడ్డాడు. భయం భయంగా చెప్పాడు. 'కాలేదు!' ఇంక అక్కడుంటే ఒట్టు. పరారు! పారిపోయాడు. స్కూటర్ స్టార్ట్ అయింది. ఎదురు హోటల్లో టెంపరరీ మకాం. కాఫీ, మామూలే, తాగుతున్నాడు.

వేణు హడావుడికి, ఆందోళనకు, భయభ్రాంతులకు రాధ ముచ్చటపడింది. అంతలో సందేహం! మనిషి ఎటువంటివాడో! ప్రవర్తన ఎటువంటిదో!

మెడికల్ షాపు ఓనరుకు పదిమంది పిల్లలు. వాళ్ళను పెంచి పెద్ద చేయటం తలకు మించిన భారమని గుర్తించాడు. అందువల్ల దేశ జనాభా తగ్గాలని చెప్పేవాడు. అధిక సంతానం వద్దని ప్రచారం చేసేవాడు. కనబడ్డ వాళ్లతో అడిగినా అడక్కపోయినా అధిక జనాభా వల్ల కలిగే కష్టనష్టాల ఏకరువు పెట్టేవాడు.

సేల్స్ గర్ల్స్‌గా పనిచేసే నలుగురినీ కూతుళ్ళు గానే భావించే వాడు. వీళ్ళకు అధిక జనాభా అనర్థాలు పాఠం చెప్పేవాడు. ఓనరు ఒక విషయం మీద ప్రసంగం ప్రారంభిస్తే మిగతా ఉపన్యాసం వీళ్ళ నలుగురూ కొనసాగించే స్థితికి ఎదిగారు. రాధ నూటికి నూరుపాళ్ళు మాట తీరుపోకుండా కంఠోపాఠంగా అప్పజెప్పేది.

కుటుంబ నియంత్రణ మందులు మాకులు, గోళీలు, బిళ్ళలు, ఇంజక్షన్లు, పాడూ పరదేసు పట్టణంలో ఎక్కడ దొరక్కపోయినా ఈ షాపులో దొరుకుతాయని జనం విశ్వాసం.

రాధ ఉదయం ఎనిమిది గంటలకు షాపుకు వస్తుంది. రాత్రి ఎనిమిది దాకా ఉంటుంది. మధ్యాహ్నం రెండు గంటలు విశ్రాంతి. భోజనం అక్కడే! అలంకారాలు అక్కడే! ఇంటికి వెళ్ళే సమయంలో కూడా అప్పుడే విచ్చుకొన్న గులాబి పువ్వులాగా నవనవలాడుతూ ఉండేది.

కళకళలాడుతూ ఉండేది. ఉదయం అయితే చెప్పే పనేలేదు. పొద్దు పొడుపులాగా ఉండేది. వయస్సు తెచ్చిన తనువు నిగారింపు, శరీరం అంతటా పరుచుకొన్న ఒంపు సొంపులు, అలంకరణలోని ఆకర్షణ, ప్రతి కదలికలోనూ పరమ అద్భుత సౌకుమార్యం, ఆమెను ఎంత చూచినా తనివి తీరదు.

ఆమె తలవూపితే, సుతారంగా గాలిలో పరీమళ తరంగాలు లేపే పూలు. చేయికదిపితే శరీరంలో నిలవని తైతక్కలు, గాజుల తళుకులు గలగలలు, మాట్లాడితే చిలుకలు పలికిన సరిగమ పదనిసలు ఎదుటివారి గుండెలమీద నృత్యం చేసేవి, స్వారీ చేసేవి, లయ తప్పించేవి.

అదేమి అద్భుత శిల్పమో ఆమెకు అలుపు ఉండేది కాదు. రాధది నవ్వు ముఖం. ఎప్పుడూ నవ్వినట్లే ఉంటుంది. ఆమె అరుదుగా నవ్వుతుంది. ఆమె నవ్వితే అద్భుత దృశ్యం. దాన్ని ఏ చిత్రకారుడూ చిత్రించలేడు. ఆమె నవ్వుకోసం లోకం పడిగాపులు పడుతుందంటే ఆశ్చర్యం లేదు. ఇవాళ ఎందుకో వేణువచ్చి పోయిన దగ్గర్నుంచి నవ్వుతెరలు తెరలుగా లోపల పొంగులు వారుతూ ఉంది. రాధ నవ్వాపుకోలేక అవస్థలు పడుతూ ఉంది. అయినా ఆగదే నవ్వు!

రకరకాల జనం వస్తారు. ప్రిస్క్రిప్షన్ ఇస్తారు. పాకెట్లు తీసుకుపోతారు. ఎవరెవరో, ఏవేవో ప్రశ్నలు వేస్తారు. ఆమె ముక్తసరిగా జవాబు చెబుతుంది 'చాలు. సరిపోతుంది.' ఆమె చెప్పిన ఆ జవాబుకే హార్స్ రేస్‌లో జాక్ పాట్ కొట్టినంత ఆనందంగా వాళ్ళు వెళిపోయేవాళ్ళు

ఆమె నోట మాట సుమధుర సంగీతంగా వినిపించేది. కోకిలకూతో, వీణాస్వరమో, అద్భుత సంగీతమో అమర గీతమో అన్నట్లు జనం ఆనందించే వాళ్ళు, ఆమె మాట తేనె పంచదారల పాకంలో ముంచి తీసినట్లు ఉంటుంది.

డబ్బు చెల్లించిన వాళ్ళు పాకెట్లు పొందేవాళ్ళు అదనంగా, ఒక చక్కని కదలిక, ఒక చిరుదరహాసం, ఒక సంగీతపదం బోనస్‌గా చూచి, విని, పరవశించేవాళ్ళు.

రాధ ఇంటరుదాకా పుస్తకాలు చదివింది. ఈ రెండేళ్ళ నుంచి మనుషుల్ని చదువుతూ ఉంది. ధనవంతులు పేదవాళ్ళు అర్థమయ్యారు. ధనవంతుల్లా పోజు పెట్టేవాళ్ళూ, పేదల్లా బీద అరుపులు అరిసేవాళ్ళూ తెలిశారు. మాటకారులు, నంగి కూతలవాళ్ళు స్పష్టమయ్యారు. వెకిలివాళ్ళు, అమాయకులు, డాబుగాళ్ళు, దర్పం రాయుళ్ళు తెలిశారు. వింతమనుషుల సరికొత్త లోకం జాగ్రత్తగా చదువుతూ ఉంది రాధ.

అయితే వేణు అర్థమయినట్లే ఉన్నాడు. అంతుబట్టటంలేదు. రోజూ రెండుసార్లు రాకపోకలున్నాయి, మనిషి కనబడతాడు కానీ, మనస్సు కనబడదు. ఆశ పడుతున్నట్లు ఉంటాడు కానీ, అభివ్యక్తం చేయడు.

ప్రిస్క్రిప్షన్ చూచి తెచ్చి ఇచ్చేలోపల రూపాయిబిళ్ళ తీసుకొని కౌంటర్ ప్లాస్టిక్ నెర్రెలో

గీస్తూ ఉంటాడు. ఇచ్చింది తీసుకొని వెళిపోతాడు. రాను రాను ఆమె ప్రిస్కిప్షను చూడకుండా ఇస్తుంది. మాట్లాడకుండా వెళిపోతుంది.

రూపాయి బిళ్ళతో ప్లాస్టిక్ నెర్రెలో గీచినప్పుడు అక్కడ ఏమీ కాదు. అయినా రాధ పాత గుడ్డ ముక్కతో కౌంటర్ తుడుస్తుంది.

ఒకరోజు చాలా ప్రయత్నం చేసి రాధ అడిగింది. 'రోజుకు రెండుసార్లు వచ్చి ఒక్కొక్కటి తీసుకొని వెళ్ళేకంటే ఒకేసారి పదో పాతికో తీసుకొని పోవచ్చు కదా'

వేణు ఏమీ మాట్లాడలేదు. అతను మాట్లాడిందాకా ఆమె చేతిలోనిది కౌంటర్ మీద పెట్టలేదు. పెడితే డబ్బు అక్కడ పెట్టి, తీసుకొని వెళిపోతాడు. చివరకు మాట్లాడక తప్పలేదు. 'నాకూ ఒక ఇష్టం ఉంటుంది కదా!'

ఉదయమే వచ్చినప్పుడు డబ్బు అక్కడ పెట్టి అడిగాడు 'మీరేనా?'

'అవును!' అంది రాధ. నిన్న సాయంకాలం పూలు కొంటున్నప్పుడు తాను స్కూటర్ మీద పోతూ తనను చూశాడు. నేను నిన్న చూడగా పూలుకొంటూ ఉన్నది మీరేనా అని అడిగాడని, అవును అన్నాను అనుకొంది రాధ.

సాయంకాలం కొంటున్నప్పుడు అడిగింది రాధ 'ఎవరికి?'

'నాకే!'

'ఎందుకు?'

'అవసరం!'

తిరుగుబోతు లాగున్నాడు అనుకొంది రాధ.

మర్నాడు ఉదయం అడిగాడు.

'పెళ్ళయితే ఉద్యోగం మానతారా?'

'ఏమో!'

పెళ్ళయి తాను వెళ్ళిపోతే చూడటానికి అందమైన అద్భుత శిల్పంలాంటి అమ్మాయి కనబడకుండా పోతుందని దిగులా?

ఏమో అంటే తానింకా ఆలోచించలేదని అర్థమా, నాకు తెలియదని భావమా, పెళ్ళి చేసుకొన్న మనిషి పనిచేయిస్తాడో, మానిపిస్తాడో తెలియదని చెప్పటమా వేణుకు అంతుబట్టలేదు.

'రాధా! ఉత్సాహంగా ఉంటున్నావు. కొత్త అందం ఉట్టిపడుతూ ఉంది. పెళ్ళి సంబంధాలు చూస్తున్నారా?' అని ఒకరోజు ఓనరు అడిగాడు.

'లేదు!' అంది. రాధకు భయంపట్టుకొంది. తండ్రివంటి ఓనరుతో అడిగితే తప్పులేదని అడిగింది. 'నా పెళ్ళయితే పనిలోంచి తీసేస్తారా?'

'నీకు పెళ్ళయినా, పిల్లల తల్లివయినా, అవ్వవయినా నీకీ ఉద్యోగం గేరంటీ!'

రాధ సంతోషించింది.

ఒనరే అడిగాడు. 'మంచి సంబంధం వచ్చి, పెళ్ళయి, భర్త పనిమానేయమంటే ఏంచేస్తావు?'

'అంతా వాళ్ళ ఇష్టంకదా!' అంది.

'అంటే పనిమానేస్తావన్నమాట?'

'అంత అదృష్టమా?'

'నీ అందం నీకు ఎంత అదృష్టమయినా తెచ్చిపెడుతుంది'

'మీ ఆశీర్వాదం!' అంది.

మరునాడు ఉదయం వేణువస్తే రాధకు ఎందుకో 'ఇతనే భర్త అయితే ఎంతబాగుంటుంది!' అనుకొంది 'పనిచేయిస్తాడా? మానిపిస్తాడా?' ఆలోచించసాగింది. 'తిరుగుబోతు కాదుగదా' అని కంగారుపడింది.

రాధ తెచ్చి కవుంటరు మీద పెట్టింది. వేణు డబ్బిచ్చి తీసుకోలేదు.

'ఏం?' అంది.

'వద్దు!' అన్నాడు.

'ఎందుకు?'

'నాకూ ఒక ఇష్టం ఉంటుందికదా!'

'మరెందుకు వచ్చారు?'

'చూచి పోదామని!'

రాధకు ఆనందంగానూ, ఆశ్చర్యంగానూ ఉంది. వేణు ముఖమెత్తి, నవ్వుముఖంతో కళ్ళలోకి చూస్తూ మాట్లాడుతున్నాడు. ఎంత అందమైన ముఖం! ఎంత చక్కని నవ్వు! ఎంతకొంటె చూపు!

బెదురు మనిషికి, బెరుకు మనిషికి, మొగమాటస్తుడికి, సిగ్గరికి ఎంతధైర్యం వచ్చింది. చూచి పోతాడా? ఏం చూచి పోదామని వచ్చాడు. కుర్రాడు రాటుదేలాడే! రాధ తనలో తాను నవ్వుకొంది. తలెత్తి చూస్తే వేణు పత్తాలేడు. స్కూటర్ లేదు. హోటల్లో లేడు. ఏమయ్యాడు?

రాధ శరీరంలో ఏదో సంచలనం. ఉద్రేకం ఉత్సాహం ఉల్లాసం. ఊపూపుగా, ఉర్రూతలుగా ఉంది హృదయం. కాళ్ళు నేలమీద ఆనటంలేదు. తాను తన బరువు కోల్పోతూ ఉంది. గాలిలో తేలుతూ ఉంది. పూవై ఎగిరిపోతూ ఉంది.

మర్నాడు ఉదయం వేణువచ్చాడు. రాధ గుండె ఎగిరెగిరి పడుతూ ఉంది. సిగ్గు ముంచుకు వస్తూ ఉంది.

అందమైన రాధ ముఖం మీద సిగ్గు వెన్నెలలా పరుచుకొంటుంటే కొత్త అందాలకోవెల ద్వారాలు తెరుచుకొంటూ ఉంది.

వేణు ముఖంలోకి సూదుల్లాంటి చూపులతో చూస్తున్నాడు. ఆమె మాటలు ఆగి, చూపు దాగి, మనిషి వంగి, కుంచించుకుపోతూ నేల చూపులు చూస్తూ ఉంది.

కౌంటరులో డబ్బు పెట్టలేదు. ప్రిస్క్రిప్షన్ పెట్టలేదు. అందరూ బిత్తరపోయి అతన్ని చూస్తూ ఉంటే అతను ఆమెనే చూస్తున్నాడు. ఎంత అందాల రాశి! ఎంత అద్భుతమూర్తి! ఎంత అపురూప లావణ్యం! పులకరించి పోతున్నాడు. రాధ లోపలికి పోబోయింది. అందం కనుమరుగవుతుందన్న భయంతో వేణు అడిగాడు 'పెళ్లయిందా?'

రాధ ముడుచుకుపోతూ ఉంది. ఏదో జవాబు చెప్పాలికదా! 'అప్పటిమాట!'

ఆ ప్రశ్నకిది జవాబుకాదు. మధ్యలో వాళ్ళు మాట్లాడుకోని సంగతులు చాలా ఉన్నాయని ఓనరు గుర్తించాడు. అతడి దృష్టిలో వాళ్ళ సంభాషణ ఇలా ఉంది.

'పెళ్ళయిందా?'

'కాలేదు!'

'ఎందుకు కాలేదు!'

'తగిన సంబంధం రాలేదు!'

'వస్తే? తగిన సంబంధం, నచ్చిన సంబంధం, కలగనే సంబంధం వస్తే?'

'వస్తే, వస్తే సంతోషమే కానీ–'

'ఏంకానీ–'

'కట్నం కానుకలు ఇచ్చుకోలేరు!'

'వాటి ప్రస్తావన లేకుండా చేసుకొంటానని ఎవరయినా ముందుకు వస్తే'

'రారు!'

'వస్తారు! వస్తే?'

'పెళ్ళి ఇష్టమే, కానీ–'

'మరేంకానీ–

'మా అమ్మా నాన్నల్ని నేనే చూచుకోవాలి! చూచుకోనిస్తారో లేదో!'

'చూచుకోనిస్తే'

'నన్నీపని చేయనిస్తారో లేదో!'

'చేయనిస్తే!'

'అప్పటి మాట'

ఇంత సంభాషణ ఓనరుకు స్పష్టమయింది. వాళ్ళ మధ్య ఈ మాటలు నడిచినట్లే వాళ్ళు భావించుకొన్నారు.

వేణు ధైర్యంగా చూడటం, నిర్భయంగా మాట్లాడటం రాధకు ఆశ్చర్యాన్నీ ఆనందాన్నీ కలిగించింది.

వికసిస్తున్న పువ్వు మళ్ళీ మొగ్గగా మారుతున్నట్లు, విప్పారిన గొడుగు, ముడుచుకుపోయినట్లు, సిగ్గు దొంతరుల మధ్య చిక్కిపోయిన రాధ విస్మయం కలిగించే సౌందర్య సంచలనంగా మారింది.

'వేణు కెంత ధైర్యం!' అనుకొంది రాధ.

'రాధ దెంత సౌందర్యం!' అనుకొన్నాడు వేణు.

ఆమె ఏమీ ఇవ్వలేదు. అతడేమీ తీసుకోలేదు.

కాఫీ హోటలుకు పోలేదు. స్కూటర్‌తో వేణు వెళ్ళిపోయాడు.

'అన్నీ లోతుగా తెలిసినవాడా? సౌందర్యం సమస్తం అర్థమయిన వాడా? తిరుగుబోతుకాడా?' రాధ తర్జనభర్జనలో పడింది.

మరునాడు ఉదయం నుంచి సాయం కాలందాకా వేణుకోసం రాధ ఎదురుతెన్నులు చూచింది. అతను రాలేదు. 'అయ్యో రాలేదే' అనుకొంది. వస్తే బాగుండననుకొంది. ఏం బాగుంటుంది అనుకొంది. ఏమయినా బాగుంటుంది అనీ అనుకొంది.

మర్నాడు వేణూ రాలేదు. ఓనరూ రాలేదు. అన్నీ తననే చూచుకోమని ఫోను చేశాడు. ఆరోగ్యం బాగుందన్నాడు. రిజిస్ట్రారు ఆఫీసులో పని ఉందన్నాడు.

రాధ అన్నీ సరిచూచి, షాపు ఎనిమిదిన్నరకు మూసి, షట్టర్లు వేసి, తాళాలు వేసి, తాళాలు తీసుకొని బయలుదేరింది.

ఉదయం మెడికల్ షాపుకు వచ్చిన ఓనరు, కేష్‌బుక్, లెడ్జర్, స్టాకు బుక్కు, రావలసిన సొమ్ము, చెల్లించవలసిన బిల్లులు, బేంక్‌చెక్ బుక్కులు, పాసుబుక్కులు ఇచ్చి, నేటి నుంచే దీని మేనేజరువు నువ్వే!' అన్నాడు.

రాధ ఆశ్చర్యం నుంచి కోలుకోక ముందే, 'పెద్దవాణ్ణయ్యాను! ఎంతోకాలం ఈ పనిచేయలేను, నీకు అన్నీ తెలుసు. నువ్వు మేనేజ్ చేయగలవు? ఏమైనా సలహా కావలిస్తే అడుగు. నెలకొకసారి లెక్కలు చూపించు! సేల్స్‌గర్ల్స్ జీతాలు నువ్వే ఇవ్వు! నీకు ఎంత జీతం కావాలో అంత నువ్వు తీసుకో' అన్నాడు.

రాధ అర్థంకాని అవస్థలో కూరుకుపోతూ ఉంది. ఊపిరి ఆడటం లేదు. ఏమనాలో తెలియక 'ఏమిటిదంతా?' అంది.

' నీ సౌందర్యం' అన్నాడు

'ఆఁ!'

'నీ అదృష్టం! నీ అర్హత!

రాధ నోటి వెంట మాట లేదు. ఆరోజంతా ఓనరు రాధకు మేనేజ్‌మెంటు బాధ్యతలు నేర్పుతున్నాడు.

రాధకు రోజంతా స్పృహతప్పుతున్నట్లే ఉంది. జ్వరం వస్తున్నట్లే ఉంది. కాళ్ళూ కళ్ళు తేలిపోతున్నట్లే ఉన్నాయి.

మర్నాడు ఉదయం మామూలుగా ఓనరు వచ్చాడు. బారెడు పొద్దెక్కినా వేణు రాలేదు. రాడేమో! వస్తాడో రాడో! వస్తే బాగుండును. ఏం బాగుంటుంది? ఏమో బాగుంటుంది!'

వేణు స్కూటర్ శబ్దం వినబడింది. మనిషి కనిపించాడు. గుండె కొట్టుకోవటం హెచ్చింది. స్కూటర్ స్టాండ్ వేశాడు. రాధ మేనేజరు కుర్చీలోంచి లేచింది. వస్తూ రెండు పెద్ద ప్లాస్టిక్ కేరీబేగ్‌లు తెచ్చాడు.

మేనేజరు కౌంటర్ మీద పెట్టాడు. 'ఇవి తీసుకొంటారా?' అడిగాడు.

రాధ సంచులు చూచింది. అవి ఆరునెలలుగా రోజుకు రెండు చొప్పున అమ్మిన పాకెట్టులు. తిరిగి ఇచ్చి వేస్తున్నాడు. వాడుకోలేదా? ఎందుకు కొన్నట్లు? ఇవి అక్కరలేదా? అవసరం లేనివి ఎందుకు కొన్నట్లు? ఎవరిని రెచ్చగొట్టటానికి? ఎవరిని ఉత్సాహపరచానికి ఎవరికి ఆసక్తి కలిగించటానికి? ఏమిటా ఆసక్తి? రాధ గుండె గుబగుబలాడుతూ ఉంది. తిరుగుబోతు కాడా? ఆలోచింపసాగింది.

సంచులు ఓనరు చూచి, నొసలు చిట్లించి, వేణును చూచి నవ్వాడు.

'ఇక భారత దేశపు జనాభా హద్దూ అదుపూ లేకుండా పెరుగుతుందా?' అనుకొన్నాడు ఓనరు.

'ఒకసారి అమ్మిన ఈ వస్తువులు మళ్ళీ తిరిగి తీసుకొని డబ్బు వెనక్కు ఇవ్వం' అంది రాధ.

'నాకు డబ్బు ఇవ్వనక్కరలేదు. ఇవి మన షాపులోనే ఉంచండి. మామూలుగా అమ్మించండి'

ఓనరు, వేణుకు తాళాలు గుత్తి ఇచ్చి, అందరికీ వీడ్కోలు చెప్పి, రాధ తలనిమిరి, మెట్లు దిగి వెళిపోయాడు.